

"బంగారం లాంటి కన్నెపిల్లని మనువుచేసుకోనంటాడేంట్రా పిచ్చయ్యగాడు." అడికి తగ్గ 'పేరెట్టేరు" పేటంతా పళ్ళికిలించింది. సావానగాళ్ళు తల కొట్టుకుని చెప్పేరు. పిచ్చయ్య నవ్వుకున్నాడు. చూసి వెర్రోడన్నారు మీరే వెర్రి వెంగళప్పలు అన్నట్టు. మరోసారి నవ్వేడు.

"కమలనిప్పు. చిదిమి దీపెం పెట్టొచ్చు. పొలం పనుల్లో వస్తాది. ఇంటిని దిద్దటంలో మొనగత్తె. నిన్ను కొండంతిదిగా సుఖ పెడ్తుంది. మీ కుటుంబానికి దగ్గిర పిల్ల, అమ్మ అబ్బ లేనిఏకాకి అని సంకోచించకు." అన్న చుట్టు పక్కాల్ని నేను పట్టిన కుందేలుకి మూడేకాళ్లు అన్నట్టు చూసేడు. పిచ్చయ్యకి నచ్చజెప్పలేక మాటుమణిగేరు. వెంటనే వూరు వాడా పిచ్చయ్యని ఖచ్చితంగా పిచ్చోడంది మొహంమీద! పిచ్చయ్య నవ్వడం మానలేదు. పిచ్చి నవ్వుగా జమకట్టి వేళాకోళం చేసేరు.

కన్న తండ్రిక్కూడా పిచ్చయ్య కొరుకుడు పడలేదు. తల్లి బ్రతికి వుంటే చెప్పేదేమోమరి!

పిచ్చయ్య తల్లి చక్కని చుక్క. పిచ్చయ్య తండ్రి మనసు పడికోరి చేసుకున్నాడు. పెళ్ళ య్యాక గుర్రబ్బండి మీద వూరేగేడు. ఏ పాపిష్టి కళ్ళ దిష్టి తగిలిందో కొడుకుని కన్న కొనాళ్ళకి కన్ను మూసింది. పిచ్చయ్య, తల్లి నోట్లోంచి వూడి పడ్డట్టుంటాడు. అందుకే దిష్టికొట్టకుండా అలాంటి పేరు పెట్టిందా తల్లి! అలాంటి అందగాడికి కమల సరిజోడు అని కన్నతండ్రి నెత్తినోరు బాదుకున్నాడు. అప్పుడు తండ్రిని అదోరకంగా చూసేడు. అందుకు బాధపడ్డ తండ్రి బాధచూడలేక పోయేడు. నోరు విప్పేడు.

"శ్రీమంతులు శ్రీమంతుల్ని చూసుకుంటే బీదా బిక్కి నెవరు కనిపెడతారు. అందుకే భగవంతుడిచ్చిన అందం వుంది గనుక కమలని ఎవరో ఒకరు పెళ్ళి చేసుకుంటారు. దేవుడు పరాకులో సృష్టించిన కురూపులు వృద్ధకన్యలుగా మిగిలిపోవడం అన్నది, మగ పుటక్కి అనర్థం! నా పెళ్ళి చూడాల నివుంటే అలాంటి పిల్లని ఇప్పటి కిప్పుడు చేసుకుంటాను లేకుంటే కొన్నాళ్ళు ఆగి నాల్గు డబ్బులు పోగేసి పెళ్ళాడతాను. అందుకే నాయుడు గారి దగ్గిర పాలేరు తనం చేస్తున్నాను." అనే సరికి పిచ్చయ్య జనకుడు అవాక్కయి నిలువు గుడ్లేసుకుని చూస్తూండి పోయేడు, ఆనాటి యశోధ బాలకృష్ణుణ్ణి గాంచినట్టు! అదిలగాయతు పెళ్లి గురించి రొక్కించలేదు.

విరమించుకున్నాడు. క్రమంగా మర్చిపోయేరు. వూరూవాడా అంతే అయింది.

అప్పటి వరకూ నివురుగప్పిన నిప్పులాగ, ఆకుచాటు పువ్వల్లే దాగిన కమల అంద చందాలు బహిర్గతమై యువ హృదయాల్లో గుబులు పుట్టించింది.

కమల అందాన్ని పెళ్లి పేరిట కొల్లగొట్టడానికి యువరత్నాలు ఆశించాయి. దొంగ మేతగాళ్ళు ప్రయత్నించి చూసేరు. ఫలితం ఎవరికీ దక్కలేదు. కాని యవ్వన జిహ్వాచాపల్యం అమితంగా బాధించింది. సహజం!

"పిచ్చయ్య కిదేం పొయ్యేకాలం! ఎవళ్ళతోనో కడుపు చేయించుకున్న దాన్ని మనువు ఆడతాడంట!" పేటంతా రెండోసారి పళ్ళికిలించింది. నేస్తాలు తలపట్టుకున్నారు. పిచ్చయ్య షరా మామూలు నవ్వుకి తెల్లబోయేరు. వెంటనే పిచ్చయ్య ఫకాలించాడు.

"నిప్పుకి చెదపట్టింది. దీపం వత్తి బొడ్డు కట్టింది. కాని పనికి బల్లెం దాన్ని మమ్మల్ని కాదని చేసుకుంటే నవ్వులుపాలై నీకు నిజంగా పిచ్చెక్కుతుంది. అదెలాగు ఏకాకి. అలాగే వుంటుందో ఛస్తుందో నీకు మాకు అనవసరం. తల కామందు లేక పొలంవెళ్లి పైకెత్తే సన్నాసి ఎదవ కులటని ఏలుకుంటాడంట. కలికాలం బుద్ధలిలాగే వుంటాయి. ఆనాడు చిలక్కి చెప్పినట్టు చెప్పి తాళి కట్టమంటే నిక్కినీల్గాడు. ఈనాడు వద్దంటే నేను పట్టిన కుందేలుకి మూడు కాళ్ళంటున్నాడు పిచ్చయ్య అచ్చంగా పిచ్చోడు. అందుకే చెబితే వినడు. వాడికి తోచదు. అని మొహం మీద బాహటంగా అంటుంటే పిచ్చయ్య వాదించలేదు. ఉడికి పోలేదు. రోషపడలేదు. వేదాంతిలా చూసేడు

వెక్కిరించారు. బుద్ధుడిఅచిరుదరహాసం చేసాడు.

పిచ్చయ్య తండ్రి దిగులు పెట్టుకున్నాడు అవునంటే కాదు, కాదంటే అవునంటున్న కొడుకు తరహాకి! వీడి మూలంగా పరువు ప్రతిష్టలు దిగజారిపోతాయి. తల్లి వుంటే గెడ్డంపట్టి బామాలి ఒప్పించేది...కాదు. వప్పించలేకపోయేది.

"అమ్మా! నీది ఆడజన్మ! కన్న పేగు ఆరాటంతో క్రూరంగా విధి చేత పరిహసింపబడ్డ స్త్రీకి అన్యాయం జరుగుతుంటే అడ్డు పడతావా?" చురకత్తి వంటి పలుకు యైన కమల మీ దృష్టిలో కురూపిలో కురూపి. అందుకే చేబట్టి మాట నిలబెట్టుకోబోతున్నాను." తండ్రి కొక్కడికే చెప్పే సూటిమాట పిచ్చయ్య గుండెల్లో వదిగి పోయింది. తండ్రి మౌనం వల్ల.

"పిచ్చిగా! మెరక చేనుకి పిగిలిపొట్ట. రెండు పూటలా నీరుపెట్టు. లేకపోతే ఈనగాచి నక్కలు పాలైనట్టు సరిగ్గా ఈనదు సరిగదా కురచ వెన్నులేసి తప్పతాలు ఎక్కువై అర్థపంట కూడా దక్కదు. ముందెల్ళి ఆ పని చూడు." నాయుడు వురిమినట్టు జాగ్రత్తలు చెప్పి హెచ్చరించాడు. విన్న పిచ్చయ్య మౌనంగా వెనక్కి తిరిగి చేతి కర్రతో కదలబోతుంటే 'ఆగర' అన్నాడు నాయుడు. పిచ్చయ్య అడుగు పడలేదు. వెనక్కి తిరగలేదు. అలాగే నిలబడి వున్నాడు. కామందు చెప్పేది చర్విత చరణమని తెల్సుగాబట్టి.

"వింటే వింటాడు. లేకపోతే లేదు. ఆ రెండు మాటలు అడిగేస్తే నా మీదనెపం వుండదు. నా పెద్దరికానికి ఢోకా వుండదు". గోడమీద పిల్లివాటం నాయుడు తంతు.

# పిగిలి పొట్ట చేను

మాధవరపు కృష్ణ



వాని నొసట రాత అలా వుంది గాబోలు! ఎవరి ఖర్మకి ఎవరు కర్తలు? నువ్వు తొందర పడకు. ఆలోచించు. తప్పటడుగు వెయ్యకు. బలవంతంగానో గ్రహపాటునో తప్పటడుగు వేసిన దాన్ని మర్చిపో" అన్న బంధువర్గాన్ని పిచ్చయ్య ఎర్రబడ్డ కళ్ళతో చూసేడు. మాడిమసై పోతామని వెనుకంజ వేసి తిట్టుకుంటూ వెళ్ళి వూరు వాడా తగలేసేరు. దావానలంలా వ్యాపించింది.

దారుణంగా చెరచబడి నెల తప్పిన నాలుగు నెలల నుండి వేడి వెచ్చ పనిగట్టుకుని చూస్తున్న పిచ్చయ్య కమలని మనువాడతాడట! పెద్ద సంఘ సంస్కర్త, వీరేశలింగం ప్రియ శిష్యుడు బయల్దేరాడండి! నోట్లో వేలు పెడితే కొరకడం చేతగాని పిచ్చివాడు బరి తెగించిపోయేడు. తన గుడిస దగ్గిర వంచిన నారీలోకానికి గాటు పెడుతుంది. ఆ వాత మానినా మచ్చ మిగిలిపోతుంది.

తండ్రి మనసు సంతానం అభివృద్ధి కాంక్షిస్తే తల్లి బిడ్డల సంస్కారానికి సానబెడుతుంది.

కొడుక్కి చెప్పే శక్తి సన్నగిల్లిన పిచ్చయ్య తండ్రి చివరికి మనశ్శాంతిని కోల్పోయేడు. అదీగాక కొడుకు చెప్పే మాటలు విని భరించే మానసిక ధారుడ్యం కూడా మాయమైంది.

తండ్రి మౌన వేదన పిచ్చయ్యని మరింతగా కట్టు దిట్ట చేసింది పిచ్చయ్య మది మందిర ద్వార బంధానికి మామిడి తోరణాలు వేలాడాయి.

"నాన్నా! ఆనాడు కురూపి మెడలో తాళి కడతానన్నాను. ఈనాడు శీలం చెడి గర్భవతి

"ఏరా చెడి కడుపుతో వున్న దాన్ని వద్దంటున్నా కావాలని మొండి పట్టు పట్టడం మంచిది కాదు. నీ యవ్వారం నాకే కాదు ఎవరికీ బావో లేదు. సరే జరిగింది మర్చిపోయి మీ పెద్దలు చూసిన పిల్లని కట్టుకో. నీ పెళ్లికి సాయం చేస్తాను" నాయుడు ఆశ పెట్టి ఆగి చూసేడు.

అంతవరకూ చేతి కర్ర చుట్టూ బలంగా బిగుసుకున్న పిచ్చయ్య చేతులు విశ్రాంతి పొందేయి. తర్వాత నేలమీద తాటించిన కర్ర చప్పుడు తప్ప సమాధానం వినబడలేదు.

ముక్తాయింపుగా, "వింటే బాగుంటావు. తర్వాత నీ ఖర్మ! కాని ఈ మాట గుర్తుంచుకో, నిన్ను వెలివేస్తే మాత్రం నేను కొత్త పాలేరుని పెట్టుకుంటాను. తర్వాత లబోదిబోమంటే

నా వల్ల కాదు...వెళ్ళు..వెళ్ళి ముందా పొట్ట పొలం సంగతి చూడు. ఒక్క నీరు పెట్టడమే కాదు. చేలో దిగి ప్రతీదుబ్బు ఇడదీసి చూడు. పురుగులు తెగుళ్ళుంటే చూసి చెప్పు. పురుగుమందు తెస్తాను. పొట్ట బైటపడే దాకా పొలాన్ని కడుపులో పెట్టుకుని కాపాడాలి. వెళ్ళు." నాయుడు తన అంతిమనిర్ణయాన్ని పొలం జాగ్రత్తల్ని కలగలిపి చెప్పి పిచ్చయ్యని సాగనంపేడు.

నిన్నటి వరకూ యజమాని నోట్లో మాటనోట్లో వుండగానే లగెత్తుకెళ్ళే పిచ్చయ్య ఈనాడు నాయుడు చేనుపట్ల చెప్పిన హితవచనాలు నెమరువేస్తూ తీరిగ్గా కదిలివెళ్ళేడు.

పిచ్చయ్య అలా వెళ్ళగానే తండ్రి వచ్చి దండం పెట్టి నుంచున్నాడు. "నీ కొడుకుని తనివితీరా కూకలు వేసేను. బెదిరించాను బాగా ముదిరిపోయేడు. లాభంలేదురా" ఆప సోపాలు పడిపోతూ నాయుడు ఏకరువు పెట్టేడు.

"ఆ మారాజుమాత్రం ఏం చెయ్యగలరు?' ' అనుకుంటూ ముసలి తండ్రి శలవు తీసుకున్నాడు.

అదే రోజు అదే క్షణంలో పిచ్చయ్య కమలల్ని వెలివేసినట్టు తీర్మానించిన కుల కూటమి పెద్దలు పేటలో ప్రతీ గడపకి వెలి బొట్టు పెట్టేరు.

ముద్దబంతి పువ్వు, పసుపు పువ్వు లాంటి కమల కామాంధుల కాంక్షకి నాశనమైంది. ఆ కిరాతకుల్ని బంధించడానికి ప్రయత్నించని కులపెద్దల, అవమానభారానికి కుళ్ళిపోతూ పాప భారాన్ని పిచ్చయ్య చలవతో మోస్తుంటే ఓర్వలేక పెళ్ళి కాకుండా తల్లి కాబోయే కన్య నెత్తిమీద వెలిబండ పెట్టేరు. అభయ హస్త మిచ్చిన పిచ్చయ్యని కూడా వెలివేసి వెర్రివాడిని చెయ్యబోయేరు.

పిచ్చయ్య పనులు పూర్తి చేసి చేను గట్టు ఎక్కేసరికి వెలిసంగతి తెల్సింది. నవ్వుకున్నాడు. పిగిలి పొట్ట పొలాన్ని కళ్ళారా చూసి గిరుక్కున వెనుదిరిగి నరానరి వచ్చి కమలతో సంభాషించేడు. వెంటనే కట్టుబట్టల్తో పేట వూరు చూస్తుండగా వెళ్ళి నాయుడు ఎదుట నిలబడ్డాడు.

పెళ్ళి కాని దంపతుల్ని గాంచి నాయుడు ఉలిక్కిపడ్డాడు. ఏం మాట్లాడాలో ఎలా మొదలు పెట్టాలో స్ఫురించక కళ్ళప్పగించి చూస్తున్నాడు. అంతలో పిచ్చయ్య సారవంత మైన పలుకులు విన్నాడు.

"కామందుగారూ! పిగిలి పొట్ట పొలానికి చెయ్యి మునిగే నీరు పెట్టేను. చేనంతా చూసేను. పురుగు సెబ్బర లేదు. రేపటి నుండి పొట్ట మీదున్న పొలాన్ని మీరన్నట్టు కంటికి రెప్పలా చూసుకోండి. నేను అదే పనిమీద నీళ్ళోసుకున్న కమలని పట్టణం తీసుకెళ్ళి డాక్టర్లకి చూపించబోతున్నాను. నా దృష్టిలో మనిషి మొక్క ఒకటే! నేను భూదేవి సేవకుడిని. ఆ చల్లని తల్లి గర్భంలో అనేక రకాలైన వరి రకాలు వూపిరి పోసుకుంటున్నాయి . బస్తాలు కొద్ది పండుతున్నాయి గాదులు నిండుతున్నాయి. ప్రజలు ప్రాణాలు నిలుస్తున్నాయి. ఆ సంకర విత్తులికి అమ్మ వేరు. బాబువేరు. అని తలచక కని పెంచి ఆకలి తీరుస్తున్న భూదేవమ్మ చెడిపోయిందా? లేదు. అలాగే కమలకూడా! వాణి నా రాణి అన్నట్టు కమలని పెళ్ళి చేసుకుంటాను. పట్టణంలో కలిసిబ్రతుకు తాము. ఈ రెండు ముక్కలు చెప్పాలని వచ్చాను. శలవు. మరొక్క మాట బాబయ్య! మమ్మల్ని వెలేసిన వారిని మేము వెలివేసి వెడుతున్నాం.. అలాగే నా పాలేరుతనం కూడా!" అని ముగించేక పిచ్చయ్య దంపతులు వెడుతుంటే నాయుడు కళ్ళముందు ఈనేసిన పిగిలిపొట్ట చేను మనోహరంగా కనబడింది.

మట్టి పిసుక్కునే పిచ్చయ్య బంగారాన్ని విడిచి పెట్టలేదు. పిచ్చయ్య పిచ్చోడు కాదు.

"పచ్చ" నోడు




